సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
గురువారం 17-7-2025
సంపుటి: 21 సంచిక: 98
పేజీలు: 8 వెల: రూ.1




# గ్రీవెన్స్‌కు ఎండార్స్‌మెంట్ల గ్రహణం


(ఫైల్‌ఫోటో)

- పరిష్కారానికి నోచుకోని వేలాది వినతులు
- 97 శాతం ఫిర్యాదులు క్లియర్ చేసేశామని నివేదికలు
- కానీ పాత సమస్యలతోనే మళ్లీ మళ్లీ వస్తున్న బాధితులు
- వాటిని ఆన్‌లైన్ చేయకుండా పక్కన పడేస్తున్నారని ఆరోపణలు


గ్రీవెన్స్ వద్ద క్యూలో ఉన్న అర్జీదారులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది ప్రతి వారం వినతులు, ఫిర్యాదులు పట్టుకొని గ్రీవెన్స్‌లో అధికారులకు సమర్పిస్తున్నా.. మెజారిటీ సమస్యలకు పరిష్కారం చూపించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదికగా చెప్పుకొంటున్న గ్రీవెన్స్‌ను అన్ని స్థాయిల అధికారులు భారంగా భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రజలు ప్రస్తావించే సమస్యలకు సకాలంలో కచ్చితమైన పరిష్కారం చూపించాలని ప్రభుత్వం ఆదేశించినా అధికారులు మొక్కుబడి తంతుగా మార్చేస్తున్నారు. ప్రతివారం అధికారులు ప్రభుత్వానికి ఇస్తున్న లెక్కల ప్రకారం కలెక్టర్ గ్రీవెన్స్‌కు వందకు పైగా అర్జీలు వస్తున్నాయి. వీటిని మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఒకే సమస్యపై మళ్లీ మళ్లీ వచ్చే, గతంలో ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదంటూ రెండోసారి, మూడోసారి అందే రిపీటెడ్ వినతులు మరో 40 వరకు ఉంటున్నాయి. అయితే వీటిని ఆన్‌లైన్ చేయకుండా పరిష్కార దశలో ఉన్నాయని చెప్పి తిప్పి పంపిస్తున్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను శాఖల వారీగా విభజించి ఆయా శాఖలకు ఆన్‌లైన్‌లో పంపించి పరిష్కారించాలని ఆదేశిస్తున్నారు. అర్జీలు అందిన 15 రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపించాలి. దీంతో అధికారులు ఎండార్స్‌మెంట్ ఇచ్చి అర్జీదారుడి ఫోటో తీసుకొని పంపించేస్తున్నారు. సమస్య పరిష్కారం కావడానికి సమయం పడుతుందని, ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకున్న తర్వాత అవకాశం వచ్చినప్పుడు కచ్చితమైన పరిష్కారం చూపిస్తామని ఈ ఎండార్స్‌మెంట్లలో పేర్కొంటున్నారు. ఇటువంటి వారంతా కొన్ని రోజుల తర్వాత తమ సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదంటూ మళ్లీ అర్జీలు పట్టుకొని గ్రీవెన్స్‌కు వస్తున్నారు. సమస్యకు పరిష్కారం కోరుతూ అర్జీ పెట్టుకొనేవారు కచ్చితంగా ఆధార్‌ను జత చేయాల్సి ఉంటుంది. ఒకసారి వినతిపత్రం ఇచ్చిన వ్యక్తి మళ్లీ మళ్లీ అదే ఆధార్‌తో పీజీఆర్‌సీలో నమోదు చేసుకోవడంతో సమస్య రీ ఓపెన్ అవుతుంది. ఇలాంటి వారందరికీ ప్రత్యేక సెల్ ఏర్పాటుచేసి పరిష్కారం చూపించే ప్రయత్నం చేస్తున్నా సాధ్యం కావడం లేదు.


పరిష్కారం కావడంలేదని వాపోతున్న అర్జీదారు

### పుంఖానుపుంఖాలుగా ఫిర్యాదులు

కలెక్టరేట్ గ్రీవెన్స్ కాకుండా తహసీల్దారు కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ చాలా మంది గ్రీవెన్స్ ఇస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లోనూ వినతులు తీసుకుంటున్నారు. కలెక్టర్, జేసీలను వ్యక్తిగతంగా కలిసి అర్జీలు సమర్పిస్తున్నవారూ ఉన్నారు. కొందరు నేరుగా సీఎంవో (ముఖ్యమంత్రి కార్యాలయం)లో ఫిర్యాదు చేస్తుంటే.. కూటమి పార్టీలు తమ కేంద్ర కార్యాలయాల్లో ప్రజాదర్బార్లు - మిగతా చివరి పేజీలో

- కొత్తూరు మండలం కలిగాం గ్రామానికి చెందిన అలికాన జగన్మోహనరావు వారసత్వ హక్కులు కలిగిన భూమిని తనకు దఖలుపరచాలని కోరుతూ మీకోసం గ్రీవెన్స్‌లో ఐదుసార్లు అర్జీ సమర్పించాడు. చివరికి హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఆరు వారాల్లో పరిష్కరించాలని హైకోర్టు ఆదేశించగా.. కోర్టులో కేసు విత్‌డ్రా చేసుకుంటే పని పూర్తిచేస్తామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. ఆ మేరకు కేసులను విత్‌డ్రా చేసుకున్న ఫిర్యాదుదారుడు ఈ వారం గ్రీవెన్స్‌కు వచ్చి సమస్యను పరిష్కరించాలని మరోసారి అర్జీ సమర్పించుకున్నా అధికారులు దాన్ని తిరస్కరించారు. అదేమిటంటే.. న్యాయస్థానంలోనే తేల్చుకోవాలంటూ పంపించేశారు.
- పొందూరు మండలం గోకర్ణపల్లికి చెందిన దివ్యాంగుడు చౌదరి అసిరినాయుడు వికలాంగుల పింఛను కోసం ఏడాది కాలంలో రెండుసార్లు గ్రీవెన్స్‌లో విన్నవించినా ఫలితం కనిపించలేదు.
- గార మండలం కే.మత్స్యలేశం పాఠశాలను కళింగపట్నానికి తరలించవద్దని కలెక్టర్ గ్రీవెన్స్‌కు నాలుగుసార్లు విన్నవించినా స్పందించపోగా.. పాఠశాలలో ఉన్న 40 మంది పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు.
- శ్రీకాకుళం మండలం సానివాడ సర్పంచ్ లక్ష్మి తమ గ్రామ పరిధిలో అంపోలు బౌండరీలో ఉన్న బరాటం చెరువులో ఆక్రమణలను తొలగించి, ఆయకట్టుకు నీరందించాలని ఇప్పటికి ఐదుసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదు.
- శ్రీకాకుళం మండలం గూడెం గ్రామానికి చెందిన సీర కోటేశ్వరరావు తనకు వారసత్వంగా దక్కిన భూమి రీసర్వేలో లే అవుట్‌గా నమోదైందని, దీన్ని సరిదిద్ది మ్యూటేషన్ చేయాలని కలెక్టర్ గ్రీవెన్స్‌కు ఐదుసార్లు విన్నవించారు. సీఎంవోకు ఫిర్యాదు చేయడంతోపాటు రెవెన్యూ మంత్రిని వినతిపత్రం ఇచ్చారు. అయినా ఇప్పటికీ పరిష్కారం చూపలేదు.

-ఒకనాటి కళింగ మహాసామ్రాజ్యంలో విలసిల్లిన సంప్రదాయం -కాలక్రమంలో రాజ్యంతోపాటు మరుగున పడిన ఆచారం
-మూడు దశాబ్దాల క్రితం కటక్‌లో పునఃప్రారంభం -గత ఏడాది నుంచి శ్రీముఖలింగ క్షేత్రంలో నిర్వహణ
-ఈ ఏడాది నవంబర్ 9న యాత్రకు సన్నాహాలు





# కళింగ ప్రాభవ ప్రతీక.. బాలియాత్ర!

ప్రపంచంలోనే అతిగొప్ప సాంస్కృతిక వారసత్వం కలిగిన దేశం మనది. భిన్నమతాలు ఉన్నా.. అన్నింటినీ సమానంగా గౌరవించే గొప్ప వారసత్వం మనది. ఈ క్రమంలో మతాలు, ప్రాంతాలు, జాతుల వారీగా దేశవ్యాప్తంగా ఎన్నో ఉత్సవాలు, యాత్రలు, పండుగలు జరుగుతుంటాయి. వాటిలో కొన్ని సనాతన కాలం నుంచీ కొనసాగుతూ వస్తున్నా.. చాలావరకు కాలగర్భంలో కలిసిపోవడంతో జనం మర్చిపోయారు. ఇంకొన్నింటిని చరిత్ర పుటల నుంచి బయటకు తీసుకొచ్చి వాటికి పునర్వైభవం కల్పించడానికి చాలాచోట్ల ప్రయత్నాలు జరుగుతున్నాయి. అటువంటి ప్రయత్నాల ఫలితంగా వేల సంవత్సరాల క్రితం కళింగ సామ్రాజ్య సంప్రదాయంగా విలసిల్లిన ఒక యాత్ర ఏడాది క్రితం మళ్లీ పురుడు పోసుకుంది. దాన్నే బాలియాత్ర లేదా బలియాత్ర అంటారు. ఒడిశాలో దాదాపు మూడు దశాబ్దాల క్రితమై పునఃప్రారంభమైన ఈ సాంస్కృతిక పండుగను మన శ్రీకాకుళం జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీముఖలింగంలో వరుసగా రెండో ఏడాది నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఒడిశాకు చెందిన ఈ యాత్రను ఆంధ్ర ప్రాంతంలో నిర్వహించడం ఏమిటి? అసలు బాలియాత్ర అంటే ఏమిటి?? కళింగులకు, ఒకనాటి కళింగ రాజ్యానికి, ఇప్పటి ఆంధ్ర ప్రాంతాలకు దీనితో ఉన్న సంబంధం ఏమిటి??? వీటికి సమాధానాలు తెలుసుకోవాలంటే ఒక్కసారి చరిత్ర పుటల్లోకి వెళ్లాల్సిందే.

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సంస్థానాల విలీనం, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు వల్ల మన దేశం ప్రస్తుత భౌగోళిక, నైసర్గిక స్వరూపం సంతరించుకుంది. కానీ పూర్వకాలం అఖండ భారతదేశం అనేక రాజ్యాలు, సంస్థానాలతో చిన్న చిన్న ముక్కలుగా విడిపోయి ఉండేది. ఎన్నో గొప్ప సామ్రాజ్యాలు దేశంలోని ఆయా ప్రాంతాలను పాలించి తమదైన ప్రత్యేక ముద్ర వేశాయి. అటువంటి వాటిలో పేరెన్నికగన్నది కళింగ సామ్రాజ్యం. వేల సంవత్సరాల క్రితమే పరిఢవిల్లిన ఈ సామ్రాజ్యం అటు కటక్ నుంచి ఇటు రాజమహేంద్రవరం వరకు విస్తరించి ఉండేది. అంటే తూర్పున మహానది నుంచి దక్షిణాన గోదావరి వరకు ఉన్న ప్రాంతాలు కళింగ సామ్రాజ్యంగా ఉండేవన్న మాట. కళింగరాజ్య ఆనవాళ్ల గురించి పక్కాగా ఎక్కడ లేకపోయినా మహాభారతంలో ఉన్న ఒక కథ ప్రకారం వాలి అనే రాజు, సేధేష్ణాదేవి దంపతులకు దర్ఘతమనుడు అనే ముని వరప్రసాదం వల్ల పుండ్ర, సుష్మ, కళింగ తదితర ఐదుగురు కుమారులు జన్మించారు. వారిలో మధ్యముడైన కళింగుడు పరిపాలించిన రాజ్యం కనుక ఈ సామ్రాజ్యానికి కళింగ రాజ్యమని పేరు వచ్చిందంటారు. ఈ రాజ్యంలో ఉన్న ప్రజలందరినీ కళింగులుగానే వ్యవహరించేవారు. కానీ ప్రస్తుతం కళింగ పేరుతో ఒక కులం ఉంది. వారినే కళింగులుగా భావిస్తున్నారు. అది కరెక్టు కాదని చరిత్రకారులు చెబుతున్నారు. ఇక ఒడియా భాషలో 'వ' అక్షరం పలకదు. ఆ అక్షరాన్ని 'బ' అని ఉచ్చరిస్తారు. ఆ విధంగా కళింగ రాజ్య మొదటి రాజుగా భావిస్తున్న వాలి పేరు కళింగుల నోళ్లలో పడి బలి లేదా బాలిగా మారిపోయిందని అంటారు. ఆ బలి రాజు వారసులైన కళింగులు చేస్తున్న యాత్రనే బాలియాత్రగా చెబుతున్నారు. దీన్ని నాటి కళింగ సామ్రాజ్య వారసత్వ సంప్రదాయంగా పరిగణిస్తున్నారు. పిత్రుతర్పణ క్రతువుగా దీన్ని పరిగణిస్తున్నారు.

### బాలియాత్ర అంటే ఏమిటి?

ఒడిశాలో దీన్ని బలియాత్ర, బలిజత్రా, బొయితా బంధన్ అని పలు పేర్లతో పిలిచినప్పటికీ బాలియాత్రగానే ఇది ప్రసిద్ధి చెందింది. ఈ యాత్ర ఉద్దేశం ఏమిటి, ఎలా.. ఎప్పుడు మొదలైందన్న దానికి చరిత్రలో స్పష్టమైన ఆధారాలు లేకపోయినా.. భిన్న కథనాలున్నాయి. ఒక కథనం ప్రకారం.. ఖారవేలుడు చక్రవర్తిగా ఉన్న సమయంలో కళింగ సామ్రాజ్యం బలవంతమైనదిగా, పటిష్టమైనదిగా పేరొందింది. ఆ సమయంలో మగధ రాజ్యాన్ని పాలిస్తున్న మౌర్య వంశ చక్రవర్తులు కళింగ రాజ్యాన్ని చేజిక్కించుకోవాలని చాలాసార్లు ప్రయత్నించి విఫలమయ్యారు. అయితే అశోకుడు మగధ - మిగతా 4లో

ప్రపంచ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
జిల్లా ప్రధాన న్యాయమూర్తి గౌ॥శ్రీ జునైద్ అహ్మద్ మౌలానా గార్కి, 1వ అదనపు జిల్లా జడ్జి గౌ॥శ్రీ ఏ.భాస్కరరావు గార్కి, 3వ అదనపు జిల్లా జడ్జి గౌ॥శ్రీ సహెచ్ వివేక్ శ్రీనివాస్ గార్కి, 4వ అదనపు జిల్లా జడ్జి గౌ॥శ్రీ ఎస్.మహేంద్ర ఫణికుమార్ గార్కి, డి.ఎల్.ఎస్.సెక్రటరీ గౌ॥శ్రీ కె.హరిబాబు సీనియర్ సివిల్ జడ్జి గార్కి, ఇతర న్యాయమూర్తులకు, జిల్లాలో ఉన్న సీనియర్, జూనియర్ న్యాయవాదులకు, మహిళా న్యాయవాదులకు, న్యాయశాఖ ఉద్యోగులకు, కోర్టు సిబ్బందికి, ప్లీడరు గుమాస్తాలకు, మరియు మిత్రులకు, శ్రేయోభిలాషులకు అంతర్జాతీయ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ...



డాక్టర్ ఎన్ని సూర్యారావు, B.A.B.L
న్యాయశ్రీ అవార్డు గ్రహీత, సీనియర్ న్యాయవాది.
మాజీ అధ్యక్షులు: జిల్లా బార్ అసోసియేషన్, శ్రీకాకుళం. సెల్: 9440609834

ప్రపంచ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
ప్రపంచ న్యాయ దినోత్సవం సందర్భంగా న్యాయమూర్తులకు, తోటి న్యాయవాదులకు, సిబ్బందికీ ప్రతి ఒక్కరికీ ప్రపంచ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు



DAVALA ANANDA RAO, B.Com,LLB
Retired Adminstrative Officer,
Advocate at High court of Andhra Pradesh
DHAVALA VIJAYA LAKSHMI, MCom BL,
Senior Advocate, Srikakulam District



• ఎడిటోరియల్

# మన నెత్తిన నాన్‌వెజ్ పాలు పోసే ఎత్తుగడ

తన మాట వినని, తమ దేశంతో వాణిజ్య, అణు, ఇతరత్రా ఒప్పందాలు చేసుకోవడానికి ముందుకు రాని దేశాలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతీకార చర్యలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. సుమారు మూడు నెలల క్రితమే ప్రపంచంలోని సగానికిపైగా దేశాలపై భారీ ఎత్తున ప్రతీకార సుంకాలు విధించి ఆయా దేశాల ఆర్థిక, వాణిజ్య వ్యవస్థలను దెబ్బతీయడానికి పూనుకున్నారు. ఈ చర్యపై విమర్శలు వెల్లువెత్తడంతో వీటి అమలును మూడు నెలలు వాయిదా వేశారు. ఈ నెలాఖరుతో ఆ గడువు ముగిసిపోతుండటంతో ట్రంప్ మహాశయుడు మళ్లీ పంజా విసరడానికి సిద్ధమవుతున్నారు. అందులో భాగంగా ఇప్పటికే 34 దేశాలకు సుంకాలకు సిద్ధంగా ఉండాలంటూ లేఖలు రాశారు. వీటిలో అమెరికా మిత్ర దేశాలు కూడా ఉండటం విశేషం. ఇక బ్రిక్స్ దేశాలైన బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా తదితర దేశాలు అమెరికాకు వ్యతిరేకంగా పని చేస్తున్నాయని ఆరోపిస్తున్న ట్రంప్ వాటిపైనా కక్ష సాధింపు చర్యలకు దిగారు. ముఖ్యంగా ఉక్రెయిన్‌తో యుద్ధంలో ఉన్న రష్యా తన మాట లెక్కచేయకుండా, శాంతి చర్చలకు రాకుండా యుద్ధం కొనసాగిస్తుండటం ట్రంప్ అహాన్ని దెబ్బతీస్తోంది. ఇప్పటికే రష్యాపై అనేక ఆంక్షలు విధించినా.. వాటిని కాదని ఆ దేశం నుంచి ముడి చమురు ఇతర దిగుమతులు చేసుకుంటున్న భారత్, చైనా, బ్రెజిల్, టర్కీ వంటి దేశాలపై ఏకంగా 500 శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ హుంకరించారు. మరోవైపు తన అడుగుజాడల్లో పని చేస్తున్న నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రియటీ ఆర్గనైజేషన్) కూటమి ప్రధాన కార్యదర్శి ద్వారా కూడా తాజాగా ఇదే తరహా హెచ్చరికలు జారీ చేయించారు. ఒకవైపు భారత్ తమకు సన్నిహిత మిత్ర దేశమని చెబుతూనే మరోవైపు తన మాట వినని ఆ దేశంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుండటం ట్రంప్ సర్కార్ ద్వంద్వ వైఖరిని తేటతెల్లం చేస్తుంది. తాజాగా ఇవే సంకాలు, ద్వైపాక్షిక వాణిజ్య అంశాలపై ఇరుదేశాల మధ్య జరుగుతున్న చర్చల సందర్భంగా నాన్‌వెజ్ పాలను భారత్‌పై బలవంతంగా రుద్దేందుకు అమెరికా అధికారులు ప్రయత్నించారు. అమెరికాకు ఎగుమతి అయ్యే భారత ఉత్పత్తులపై పది శాతం, భారత్ దిగుమతి చేసుకునే అమెరికా ఉత్పత్తులపై 5 నుంచి 8 శాతం వరకు సుంకాల విధింపునకు అంగీకారం కుదిరింది. మరికొన్నింటిపై అధిక టారిఫ్‌లు ఉండవచ్చని అంటున్నారు. చర్చలు కొలిక్కి వచ్చినా నాన్‌వెజ్ పాలు, దాని ఉత్పత్తులను దిగుమతి చేసుకునేందుకు మాత్రం భారత్ అంగీకరించలేదు. దాంతో అమెరికా పాడి ఉత్పత్తులకు సంబంధించి ఇంకా ఎటువంటి ఒప్పందం కుదరలేదు. ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా తమ పాడి ఉత్పత్తులు దిగుమతి చేసుకోవాలని అమెరికా తీవ్రమైన ఒత్తిడే తెచ్చి ఎలాగైనా వాటిని అంటగట్టాలని చూసినా భారత్ గట్టిగా నిలబడింది. తన వైఖరిని నిర్మొహమాటంగా చెప్పేసింది. అమెరికా పాడి ఉత్పత్తులను ముఖ్యంగా నాన్‌వెజ్ పాలు దిగుమతి చేసుకుంటే తమ దేశం సంస్కృతి సంప్రదాయాలతో పాటు ఈ రంగాలపై ఆధారపడిన కోట్లాది భారతీయుల ప్రయోజనాలు దెబ్బతింటాయని స్పష్టం చేసి అమెరికా ప్రతిపాదనను తిరస్కరించింది. అయితే దేశం ఏదైనా పాలు ఒకే రకంగా ఉంటాయి కదా? ఈ నాన్‌వెజ్ పాలు ఏమిటి?? అన్న సందేహాలు కలగడం సహజం. ఎక్కడైనా ఆవులు, గేదెలు, ఇతర పశువులు ఇచ్చే పాలను నాన్‌వెజ్‌గా ఎలా ట్రీట్ చేస్తారు అన్న సందేహం కూడా కలగవచ్చు. అమెరికాలో పాడి పశువుల పోషణ విధానం కాస్త భిన్నగా ఉంటుంది. మన దేశంలో పాడి పశువులకు గడ్డి, కుడితి, కూరగాయల వ్యర్థాలు వంటి శాకాహారాలను పెట్టి పోషిస్తుంటారు. అవి ఇచ్చే పాలను నిరభ్యంతరంగా అందరూ వాడుతున్నారు. కానీ అమెరికాలో పాడి పశువులకు గడ్డితో పాటు కోళ్లు, చేపలు, ఇతర పశువులకు సంబంధించిన మాంస వ్యర్థాలు, వాటి కొవ్వులతో తయారు చేసిన పదార్థాలను ఆహారంగా వేస్తుంటారు. ఇటువంటి ఆహారం తినే పశువులు మరింత ఎక్కువగా పాలు ఇస్తాయని అంటారు. ఈ పశువులు ఇచ్చే పాలనే నాన్‌వెజ్ పాలుగా వ్యవహరిస్తున్నారు. అందుకే అమెరికా పాలపై భారత్ అభ్యంతరం వ్యక్తం చేసింది. మనదేశంలో పాలను పవిత్ర పదార్థంగా కూడా భావించి పూజలు, శుభకార్యాల్లో దేవుళ్ల అభిషేకాలకు వినియోగిస్తుంటారు. ప్రసాదాల తయారీలోనూ వాడుతుంటారు. అలాంటిది అమెరికాలో మాంసాహార వ్యర్థాలు తినే పశువులు ఇచ్చే పాలను ఎలా పవిత్రంగా భావించగలమన్నది భారత వాదన. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు విరుద్ధమంటూ తిరస్కరించడం విశేషం.

## చదువులతల్లికి అండగా హర్షవల్లి లయన్స్ క్లబ్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నిశ్చలమైన దానం విద్యాదానమని హర్షవల్లి లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం వ్యవస్థాపకులు హారికాప్రసాద్ గురువారం అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ రెండవ సంవత్సరం చదువుతున్న జోషిత ప్రియకు చదువు నిమిత్తం రూ.10వేల నగదుతోపాటు పుస్తకాలు, అవసరమైన సామాగ్రిని లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి కార్యాలయంలో హారికాప్రసాద్ అందించి మాట్లాడుతూ విద్యాదానం ఎప్పుడూ వృధా కాదన్నారు. చదువుకోవాలనే తపన ఉన్న విద్యార్థులను ప్రొత్సాహిస్తే, చదువుపై మక్కువ పెరుగుతుందని, పేద విద్యార్థుల చదువు కావాల్సిన అవసరాలను తీర్చటం ఒక బాధ్యతన్నారు. పాఠశాల, కళాశాల యూనిఫామ్, పుస్తకాలు, బ్యాగులు వంటి అవసరాలను పేద విద్యార్థులు భరించలేకపోతున్నారని, అలాంటి పేద విద్యార్థులకు తమ శక్తిమేరకు బాసటగా నిలుస్తామన్నారు. జోషితప్రియ బాగా చదువుతుందని, పేద విద్యార్థిని కావటంతో ప్రొత్సాహాన్నందించామని అధ్యక్షులు డాక్టర్ మేడిశెట్టి సత్యస్వరూప్ తెలిపారు. కార్యక్రమంలో డా.కృష్ణమోహన్, పూర్వపు జోన్ చైర్మన్ శోభారాణి తెలిపారు.



## ధర్నాను జయప్రదం చేయండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దు ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ ఆగస్టు 5వ తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయాలు వద్ద ధర్నాలను జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్యభవన్ సీపీఎం కార్యాలయంలో విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని కోరుతూ రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్మార్ట్‌మీటర్లు బద్దలు కొట్టండి అని యువగళం పాదయాత్రలో లోకేష్ పిలుపు ఇచ్చారని అధికారంలోకి వచ్చిన తరువాత అదానీ స్మార్ట్‌మీటర్లు బిగించడం మోసం కాదా అని వారు ప్రశ్నించారు. స్మార్ట్‌మీటర్లు ద్వారా ప్రజలను తీవ్రంగా దోపిడీ చేయడానికి పూనుకుంటున్నారని విమర్శించారు. టైం ఆఫ్ ది డే విధానం పేరుతో గంట గంటకు రీడింగ్ తీయవచ్చు అని, పగలు ఒక రేటు, రాత్రి ఒక రేటు, చలికాలం ఒక రేటు, వేసవికాలం ఒక రేటు, సాయంత్రం 6 గంటల నుండి 10 గంటల వరకు మరొక రేటు ఉంటుందని వారు తెలిపారు. ఈ విధంగా ప్రజలను అదానీ కంపెనీ దోపిడీ చేస్తుందని విమర్శించారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో సామాన్య ప్రజలు గగ్గోలు పెడుతున్నారని, ఎన్నికలకు ముందు కూటమి కరెంటు చార్జీలు పెంచబోమని, బాదుడు ఆపుతామని చెప్పిందని, అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. అదానీ స్మార్ట్ మీటర్లు ఖర్చులు నిమిత్తం 93 నెలల్లో అదనపు చార్జీలు వసూలు చేస్తారని వారన్నారు. ఇళ్ళకు బిగించకుండా ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. దక్షిణాదిలో కేరళ, బెంగాల్, తమిళనాడు కర్ణాటక ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాయన్నారు. ఇక్కడ డబుల్ ఇంజన్ సర్కారు స్మార్ట్‌మీటర్లు పెడుతుందని విమర్శించారు. రాష్ట్రంలో రెండు కోట్ల మీటర్లు పెట్టి రూ.25వేల కోట్ల భారం ప్రజల మీద వేసి దోపిడీ చేయడానికి పూనుకున్నారన్నారు. స్మార్ట్‌మీటర్‌కి వ్యతిరేకంగా ఉద్యమం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. జూలై 18 నుండి 22 వరకు పట్టణ, మండల కేంద్రాలలో సదస్సులు జయప్రదం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ ఎం.గోవర్ధనరావులు పాల్గొన్నారు.



ఎఫ్‌ఎచ్‌ఆర్‌ఏఐ అధ్యక్షులు కె.శ్యామ్‌రాజు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎం.బాలకృష్ణరెడ్డి, నాగరాజ్, రమణలు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా బెంగళూరులో జరగనున్న ఎఫ్‌ఎచ్‌ఆర్‌ఏఐ కన్వెన్షన్‌కు ఆయనను ఆహ్వానించారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## సుపరిపాలన చంద్రబాబుకే సుసాధ్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రాన్ని సుభిక్షంగా పరిపాలించడం కేవలం చంద్రబాబుకే సాధ్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం 213 బూత్‌లో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తొలి ఏడాది పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు తనదైన శైలిలో అభివృద్ధి, సంక్షేమం ఏమిటో చేసి చూపించి అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందారన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు పట్ల ప్రజల నుండి హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయన్నారు. వైకాపా నేత జగన్ ఐదేళ్ళ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిపోయిందన్నారు. వ్యవస్థలన్నిటినీ నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. అటువంటి దుష్ట పరిస్థితులు నుండి రాష్ట్రాన్ని రక్షించి గాడితప్పిన పాలనను అభివృద్ధి సంక్షేమం వైపు పరుగులు పెట్టిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. తొలి ఏడాదిలోనే ఇంత అభివృద్ధి చేస్తే రాబోయే కాలంలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు జరిగి, పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పన జరిగి, రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపి, రైతులు, మహిళలు, యువత అన్ని వర్గాలు వారు సుఖ సంతోషాలతో ఉండాలన్నదే చంద్రబాబు విజన్ 2047 ముఖ్య లక్ష్యమన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి జిల్లాలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా రూపొందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రెండో డివిజన్ ఇన్‌చార్జ్ ఆకెన రాజారావు, రెడ్డి శివ, జగన్, రమణ తదితరులు పాల్గొన్నారు.





ఆరోజురాత్రికి నైట్ షిఫ్టున్నా సరే.. పగటినిద్రని త్యాగం జేసి మరీ, పొద్దున్నే లేచి తయారైపోయి, ముందు రోజు తెప్పించిన టికెట్లను కళ్ళకద్దుకుని నేను, రంజిత్తూ, వాళ్ళన్నయ్య, రాజశేఖర్, చిన్నభోజన్న అందరం తయారైపోయి షార్జా సిటీ సెంటర్ పక్కనే ఉన్న స్టార్ సినిమా ప్లెక్సుకి.. అసలే శుక్రవారం ఒకటేమో, తండోపతండాలుగా విచ్చేసిన తెలుగు ప్రేక్షకులతో పాటు ఇతర భాషా ప్రేక్షకాభిమానులతో కిటకిటలాడిపోతోంది ఆవరణంతా.. ఈ సినిమా మీద అందరూ అంచనాలు ఎంతగా పెట్టుకున్నారో అర్థమయ్యింది.. సినిమా మొదలైంది.. మొదటి ఐదు నిమిషాలు హిస్టియానిక్స్ అసలు.. అవధుల్లేని సీజీ వర్కుతో అలకబడ్డ తెర మీద రమ్యకృష్ణ పరమేశ్వరా అంటూ ఆకాశంలోకి బిడ్డని చూపిస్తూ, క్రోధంగా అర్థించే సన్నివేశాన్ని చూసి ఏదో గట్టిగానే జరగబోతోందని కుర్చీని గట్టిగా పట్టుకుని కూర్చున్న క్షణం అది.. కానీ నా అంచనాలకి భిన్నంగా కథ ముందుకెళ్ళే కొద్దీ గ్రాఫు కిందకి పడుతూ వస్తోంది.. గ్రాఫిక్సు మీదనే అల్లిన ధీవరా పాటగానీ, ప్రభాస్-తమన్నాల మధ్య జరుగుతోన్న రొమాన్సు గానీ ఏవీ రోమాంచితం చెయ్యలేక పోతున్నాయ్ నాలో ప్రేక్షకుడిని..

అన్నట్టు..
ఈ బాహుబలి 1, 2లో తమన్నాకి డూపుగా నటించిన ఆరాధనా సింగ్ అనబడే ఓ జూనియర్ ఆర్టిస్టు.. తన పోలికలతోనే ఉండే కవలచెల్లెలికి యే రకంగానూ తను పోటీ కాకూడదని భావించి, ఫీల్డు నుంచి తప్పుకుని జాబు వెతుక్కుంటూ విదేశాలకొచ్చేసి, కాలక్రమంలో మా కంపెనీలోనే సేల్స్ విభాగంలో పనికి కుదురుకుంటుందని.. అప్పుడప్పుడూ నైట్ షిఫ్టులప్పుడు దొర్లే మా కబుర్ల మధ్యలో ఆ షూటింగ్ విశేషాలవీ చెప్తూ తన గాజుకళ్ళు తడిచేసుకుంటుందని.. అప్పట్లో ఈ సినిమా చూస్తున్నప్పుడు యే మాత్రం నా ఊహాకందని విషయం..

## అవధులు లేని సీజీ వర్క్..

# కుర్చీలకు అతక్కునే అద్భుతమే చేసింది!

మట్టి కొట్టుకుపోయున్న అనుష్క కష్టాలకి కడుపులో దేవింది.. నింపాదిగా సాగుతోన్న కథనానికి నడుం లాగింది. ఎందుకివన్నీ అని విసుక్కుంటున్నప్పుడు అర్థం కాలేదు, తర్వాత జరగబోయే కథకి అవే వేదిక అవబోతున్నాయని..

పచ్చాబొట్టేసినా పాట పూర్తయ్యేసరికి హత్తుకుని పడుకున్న హీరోహీరోయిన్లని చూసి, "ఈళ్ళిక్కడే దుకాణం పెట్టిర్రు.." అని విసుక్కున్నాడు ఓ రసహీన ప్రేక్షకుడెవరో.. దాదాపు మాదీ అదే ఆలోచన.. ఇదేంటీ రాజమౌళి మార్కు సన్నివేశం ఒక్కటీ కనబడేట్లేదూ అనుకుంటూ తెగ వెతికేస్తున్నాం..

ఎట్టకేలకు తమన్నా బారిన పడి, తన లక్ష్యసాధన కోసం మాహిష్మతి బయల్దేరి వెళ్ళాడు శివుడు.. హమ్మయ్య.. కోట గోడెక్కి లోపలికి దూకి నేల మీద అడుగుపెట్టేసరికి అమరేంద్ర బాహుబలి గెటప్‌లో ఉన్న ప్రభాస్ ప్రత్యక్షం అవ్వగానే..తెరముందు కూర్చున్న ప్రేక్షకుడు నోరొదిలేశాడు.. అక్కడ్నుంచి భల్లాలదేవుడి విగ్రహాన్ని పైకి లేపుతోన్న సన్నివేశంలో బాహుబలి ఐడెంటిటీ సీనుకి, నాలో మాస్ ప్రేక్షకుడికి చిన్న కదలిక వచ్చింది.. అయినాగానీ ఇంకా ఏదో వెలితి, ఎక్కడో అసంతృప్తి.. ఎలివేషన్లన్నీ రెండోభాగానికి దాచిపెట్టి ఇందులో ఎమోషన్ని మాత్రమే పండించడంతో నాకు పెద్దగా ఆనట్లేదు.. ఇంకా ఏదో కావాలనిపిస్తోంది..!! ఎలా ఉందని మావాళ్ళు ఇంటర్వెల్లో అడిగిన ప్రశ్నకు "అబ్బే.. రాజమౌళి సినిమాలా లేదు.." అని బదులిచ్చాను బింకం ప్రదర్శిస్తూ..

సెకండాఫ్ మొదలైంది.. దేవసేనని తప్పించే క్రమంలో, కట్టప్పతో తలపడుతూ అడవి శేష్ తలని ఒక్కవేటుతో నరుకుతాడు శివుడు.. తల లేకుండానే ఓ నాలుగడుగులు నడుచుకుంటూ ముందుకెళ్ళి అప్పుడు కింద పడుతుంది ఆ మొండెం.. ఈలలు, మోతలతో థియేటర్ మొత్తం ఊగిపోయిన షాట్ అది..ఆ హఠాత్ పరిణామానికి, అవమానానికి బిక్కచ్చిపోయాడు కట్టప్ప.. కోపం గుండుకి అంటింది.. అనీలుడు విసిరిన బల్లేన్ని అందుకుని పరిగెత్తుకొస్తున్న కట్టప్పకి క్షణకాలపు మెరుపు వెలుగులో కనిపించింది బాహుబలి పోలికలున్న శత్రుమొఖం.. అంతే.. దూసుకొస్తున్నవాడల్లా, నేల మీద సాగిలపడ్డాడు. సీనియర్ సైన్యం అదిరిపడింది.. హమ్మో రాజుగారి బిడ్డంటూ అందరూ మోకాళ్ళేశారు.. "మీరిప్పుడేస్తున్నారు, నేను రాత్రే వేసేశాను.." అని తమన్నా గర్వపడింది..

### కట్ చేస్తే..

అప్పటిదాకా అసంతృప్తిగా కూర్చున్న నేను సినిమాలో ఎప్పుడు లీనమయ్యానో తెలియకుండానే విజిల్లేసేశాను.. ఫ్లాష్‌బ్యాక్ మొదలయ్యి, కాలకేయుల యుద్ధం పూర్తయ్యి, క్లైమాక్సుకి చేరేసరికి.. రాజమౌళి అనే శిల్పి అప్పటిదాకా యే భారతీయ హీరోలోనూ చూడని గంభీరమైన రాజసాన్ని ప్రభాస్ రూపంలో తెరనిండా పరిచేశాడు.

మ్యాన్లీనెస్ అనే పదాన్ని కండల ప్రదర్శనకి మాత్రమే పరిమితం చేసేసిన బాలీవుడ్ సమీకరణాలకి కోరమీసాన్ని, సూదంటు చూపుల్ని బోనస్సుగా అందించి ఇన్నాళ్ళూ వాళ్ళేం కోల్పోయారో స్పష్టంగా చెప్పాడు ప్రభాస్. ఆ దెబ్బకి.. బీ గ్రేడు హిందీ యాక్షన్ సినిమాలు మాత్రమే ఆడే బీహార్‌లాంటి మారుమూల సెంటర్లలో సైతం మహారాజుగా వెలుగులు విరజిమ్ముతూ, ఖాన్లకి మొగుడయ్యి కూర్చున్నాడు నేటికీ..

సినిమా పూర్తయ్యేసరికి బాక్సాఫీస్ సాహో అంది.. తెలుగు హయ్యెస్ట్ షేర్లన్నీ రెండురోజులకే లేచిపోయి, మూడో రోజు కలెక్షన్లకి నాన్-బాహుబలి రికార్డులు అనే కొత్త పేర్లు పెట్టుకోవాల్సొచ్చింది..

"కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడు.." అనే ప్రశ్న అయితే దేశం మొత్తాన్ని రెండేళ్లపాటు వేధిస్తూనే ఉంది.. ఆ ఎదురుచూపులే రెండోపార్ట్ విజయాన్ని మూడింతలు చెయ్యడంలో పదిరెట్లు సాయపడ్డాయి..

**- హరిబాబు ముద్దకూరి**

ఇవన్నీ బాహుబలి సాధించిన ఘనతలైతే, పరిశ్రమకి దాపురించిన నష్టాలు కూడా కొన్నున్నాయ్ మరి.. బాహుబలి లాంటి భారీ రాజుని చూసిన ప్రేక్షకుడి కంటికి సాధారణ/చిన్న స్థాయి సినిమా ఆనడం మానేసి, హాలులో ఆడడం తగ్గిపోయింది ఎంతో బాగుందని పేరొస్తే తప్ప.. ఎవరికివాళ్ళు తమకో బాహుబలి తీసిపెట్టాలనే అనవసరపు అవసరాల్ని సృష్టించేసుకునేసరికి, నిర్మాత ఉక్కిరిబిక్కిరైపోవడం మొదలెట్టాడు. ఏడాదికో సినిమానైనా అందిస్తూ పరిశ్రమకి చేతినిండా పని దొరికేలా చేసిన హీరోలు, భారీతనం పేరుతో బిగుసుకుపోయి బద్ధకానికి బ్రాండ్ అంబాసిడర్లైపోయారు.. ఏమన్నా అంటే క్వాలిటీ ముఖ్యమనే చిలకపలుకులు నేర్చేసి, నెపాన్ని ప్రేక్షకుల మీదకి నెట్టేశారు.. ఇందులో క్రెడిట్ ఏమైనా ఉంటే అది మొత్తం రాజమౌళిగారిదే.. ప్రాంతీయ సినిమాకి పానిండియా రోగం అంటించి, ప్రచారశైలిని, విడుదలస్థాయిని కూడా సమూలంగా మార్చేసిన దర్శక మాయావి.. తెలుగుతెర మైదానం మీద భారీబడ్జెట్టనే గారడీబీజం మొలకెత్తించి, ఆ వ్యాపారవృక్షం కింద కాసులు రాల్చుకోవడమెలాగో నేర్పిన వాణిజ్య నిపుణుడు.. గుప్పున గుభాళించే కరెన్సీకట్ట గురించి ఏమంటామండీ, అద్దాల బీరువాలోంచి చూస్తూ కళ్ళకద్దుకోవడం తప్ప..! కాబట్టి నో కామెంట్స్..



# ఫాస్టాగ్ యాన్యువల్ పాస్..

# టోల్ ట్యాక్స్ రూ.15 మాత్రమే!



దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల మీద ఫాస్టాగ్ ఉపయోగించే వారి కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల కీలక ప్రకటన చేసింది. దీంతో వాహనదారులకు ఉపశమనం లభించనుంది. ప్రైవేటు డ్రైవర్లు కావాలను కుంటే ఫాస్టాగ్ కోసం ప్రత్యేక పాస్ తీసుకోవచ్చు. ఒకసారి ఈ పాస్ తీసుకుంటే, అది ఏడాదంతా పనికొస్తుంది. ఈ స్కీమ్ వల్ల జాతీయ రహదారుల మీద ప్రయాణం మరింత తేలికగా, లాభదాయకంగా మారుతుందని చెబుతున్నారు. వార్షిక పాస్ విలువను రూ.3వేలుగా నిర్ణయించారు. ఈ పాస్‌ను ఏడాదిలో 200 ట్రిప్పులకు ఉపయోగించు కోవచ్చు. దేశంలోని అన్ని జాతీయ రహదారులపైనా ఉపయోగించొచ్చు. ఈ పాస్ కేవలం ప్రైవేటు, వాణిజ్యేతర వాహనాలకు మాత్రమే పనికొస్తుంది. టోల్ ప్లాజాల వద్ద ప్రయాణికుల సమయాన్ని ఆదా చేయడం, రద్దీని తగ్గించడం, ప్రయాణాల్ని మరింత లాభసాటిగా మార్చే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది.




### ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుంది?

ఇయర్లీ పాస్ ఆగస్టు 15 నుంచి అమల్లోకి రానుంది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ వెబ్‌సైట్, హైవే ట్రావెల్ యాప్ ద్వారా యాక్టివేట్ చేసుకోవడంతో పాటు రెన్యువల్ చేసుకోవచ్చు. దీనికి సంబంధించిన లింక్ త్వరలో అందు బాటులో రానుంది. ఫాస్టాగ్ వార్షిక పాస్‌తో ఒక ట్రిప్ అంటే ఒక టోల్‌ప్లాజాను దాటడం అని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఒక ప్రకటన లో చెప్పారు. అంటే దీనర్థం వార్షిక పాస్ సాయంతో ఏడాదిలో 200 టోల్‌ప్లాజాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా దాటవచ్చు.

### ఎంత లాభం?

ప్రస్తుతం టోల్ ప్లాజాల వద్ద రకరకాల ఫీజులు వసూలు చేస్తున్నారు. కొన్నిచోట్ల రూ.50, మరికొన్ని చోట్ల రూ.80, ఇంకొన్ని చోట్ల రూ.100 టోల్ చార్జ్ తీసుకుంటున్నారు. అయితే వార్షిక టోల్ పాస్‌తో ఒక టోల్ ప్లాజా దగ్గర ప్రైవేటు వాహనానికి రూ.15 మాత్రమే ఉంటుంది. ఉదాహరణకు ప్రస్తుతం టోల్ ప్లాజా వద్ద వాహనానికి రూ.50 చెల్లిస్తుంటే 200 ట్రిప్పులకు అది రూ.10వేలు అవుతుంది. అయితే వార్షిక పాస్ ఉంటే అదే 200 ట్రిప్పులకు రూ.3 వేలు మాత్రమే ఖర్చవుతుంది. ఈ పాస్ కేవలం జాతీయ రహదారుల మీద మాత్రమే పనికొస్తుంది. రాష్ట్ర రహదారులు, స్థానిక టోల్ ప్లాజాల వద్ద పని చేయదు. ప్రస్తుతం టోల్ ప్లాజాల వద్ద అమలు చేస్తున్న రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ టెక్నాలజీతో వార్షిక పాస్‌లను అనుసంధానం చేస్తారు దీన్ని ఉపయోగించడానికి ముందు ఫాస్టాగ్‌లో యాక్టివేట్ చేయాలి.

### 60 కిలోమీటర్ల వివాదం ఏంటి?

జాతీయ రహదారుల మీద రెండు టోల్ ప్లాజాల మధ్య దూరం 60 కిలోమీటర్లు ఉండాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ 2022లో చెప్పారు. అంటే మీరు ఒక టోల్ ప్లాజా నుంచి బయల్దేరిన తర్వాత రెండో టోల్‌ప్లాజా 60 కిలోమీటర్లు లేదా ఆ తర్వాత రావాలి. వాహనదారులు పదే పదే టోల్ ఫీజులు చెల్లించకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ ఏర్పాటు చేసింది. అయితే అనేక మంది కేంద్రమంత్రి వ్యాఖ్యల్ని తప్పుగా అర్థం చేసుకున్నారు. ఇంట్లో వాహనం మీద బయల్దేరిన తర్వాత 60 కిలోమీటర్ల వరకు ఎలాంటి టోల్ ఫీజు ఉండదని అనుకున్నారు. అయితే ఈ నిబంధన రెండు టోల్ ప్లాజాల మధ్య మాత్రమే వర్తిస్తుంది. అంతకు ముందు, టోల్ ప్లాజాల సమీపంలో ఉన్న వారికి నెలవారీ పాస్ సౌకర్యం కల్పించారు. దీంతో వారు రోజూ టోల్ ఫీజు చెల్లించాల్సిన అవసరం ఉండదు. అయితే ఇప్పుడు వార్షికపాస్‌తో మంత్లీ పాస్ అవసరం లేదు.


### ఇయర్లీ పాస్ అమలు ఉద్దేశం ఏంటి?

వార్షిక పాస్ ప్రధాన ఉద్దేశం టోల్ ప్లాజాల వద్ద రద్దీని, ఫాస్టాగ్‌కు సంబంధించిన వివాదాలను తగ్గించడం, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడంతో పాటు జాతీయ రహదారుల మీద ప్రయాణాన్ని సులభతరంగా మార్చడం. ఇయర్లీ పాస్‌తో జాతీయ రహదారుల మీద హాయిగా, లాభదాయకంగా ప్రయాణం చేయవచ్చు. ఆటంకాలు లేకుండా టోల్ చార్జీల వసూలు కోసం ప్రభుత్వం అనేక మార్గాలు అన్వేషిస్తోంది. ఈ విధానంలో ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నిషన్, ఫాస్టాగ్‌ను ఉపయోగిస్తారు. దీనికి సంబంధించి కొన్ని ఎంపిక చేసిన జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల మీద ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నారు. ఈ విధానంలో టోల్ ప్లాజా వద్ద వాహనం నెంబర్ ప్లేట్‌ను గుర్తించి టోల్ ఫీజును వసూలు చేస్తారు.

### టోల్ టాక్స్ అంటే ఏంటి?

రహదారులు, భారీ వంతెనలు, సొరంగ మార్గాలు, ఎక్స్‌ప్రెస్ రహదారుల్ని ఉపయోగించుకుంటున్నందుకు ప్రభుత్వం లేదా ప్రభుత్వం ఆమోదించిన సంస్థ వసూలు చేసే పన్నును టోల్ టాక్స్ అంటున్నారు. కొన్నిసార్లు రాష్ట్ర రహదారుల మీద కూడా టోల్ టాక్స్ విధిస్తారు. ఇలా వచ్చిన నిధులను ప్రభుత్వం రహదారుల నిర్మాణం, నిర్వహణ, మరిన్ని సౌకర్యాల కల్పనకు ఖర్చు చేస్తుంది. టోల్ టాక్స్ చెల్లించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. నగదు రూపంలో, డిజిటల్ అంటే ఫాస్టాగ్ ద్వారా కూడా చెల్లించవచ్చు. జాతీయ రహదారుల మీద వెళ్లే వాహనాలకు ఫాస్టాగ్‌ను తప్పనిసరి చేశారు. జాతీయ రహదారుల మీద టోల్ ఫీజును ఎలక్ట్రానిక్ విధానంలో వసూలు చేసుకోవడానికి ఫాస్టాగ్ ఉపకరిస్తుంది. దీని సాయంతో రహదారులపై టోల్ ప్లాజా వద్ద ఆగకుండా, నగదుతో పని లేకుండా టోల్ ఫీజు చెల్లించవచ్చు. ఫాస్టాగ్ ఒక చిన్న స్టిక్కర్ రూపంలో ఉంటుంది. ఇందులో రేడియో ఫ్రీక్వెన్సీ ఐడింటిఫికేషన్ టెక్నాలజీ అమర్చి ఉంటుంది. దీన్ని అంటించుకున్న వాహనం టోల్ ప్లాజా గుండా వెళుతున్నప్పుడు, స్టిక్కర్‌ను స్కాన్ చేస్తే స్టిక్కర్‌తో అనుసంధానించిన బ్యాంక్ అకౌంట్ నుంచి టోల్ రుసుము ఆటోమేటిక్‌గా టోల్ ప్లాజా ఖాతాలోకి వెళ్లిపోతుంది.

- బీబీసీ సౌజన్యంతో..





# సర్కార్ విఫలమైన చోట..

## విద్యావికాసాన్నందిస్తున్న గిరిజన మహిళ!




పట్టణ వీధులకే కాదు.. పట్టించుకుని సమస్యలు పరిష్కరించే సమయం లేని అధికారులకూ దూరం ఆ గిరిజన గ్రామం. చదువు అందని ద్రాక్ష. అదిగో అక్కడే ఓ గిరిజన గృహిణిలో కలిగిన ఆలోచన ఓ స్కూల్ ఏర్పాటుకు బీజం వేసింది. అలా ఓ మట్టిగుడిసెలో ప్రారంభమైన ఆ విద్యాలయం.. ప్రైవేట్ సంగతి అసలు పక్కనబెడితే.. ప్రభుత్వ పాఠశాలలు కూడా దిక్కులేక చదువుకు దూరమవుతున్న పిల్లల పాలిట చదువుల కేంద్రమైంది.

ఇది పశ్చిమబెంగాల్ అయోధ్య కొండల్లోని పురూలియా అటవీ గిరిజన గ్రామం కథ. ఏ ప్రభుత్వ పథకాలందని చోట.. కనీసం అక్కడి ప్రభుత్వం అక్కడో పాఠశాలను ఏర్పాటు చేయలేని ప్రాంతంలో 30 ఏళ్ల మాలతీ ముర్ము ఆలోచనకు బీజం ఓ మడ్ స్కూల్.

ఆ పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏమీ లేవు. సిబ్బందీ లేరు. ఆ పాఠశాలకు నిధులందించే ప్రభుత్వం పట్టించుకోదు. అసలా పాఠశాల అక్కడ ఉందనే విషయమే ఈ నాగరిక ప్రపంచానికి తెలియదు. తెలిసినా పట్టించుకునేవారూ కనిపించరు. కానీ, ఆ స్కూల్ మాత్రం క్రమశిక్షణకు మారుపేలా నడుస్తోంది. ప్రతీ ఉదయం 45 మంది పిల్లలు క్రమం తప్పకుండా అక్కడికొచ్చి ఆసక్తిగా చదువుకోవడం ఆకట్టుకుంటుంది. దక్షిణాసియాలో సంతాలీ గిరిజన జనం మాట్లాడే సంతాలీ భాషలోనే వారి విద్యాభ్యాసం సాగుతుంది. ఓల్ చికి వారి లిపి. ఆ లిపిలోనే తమ విద్యాభ్యాసం కొనసాగిస్తూ.. సమాజంలో కావాల్సిన చైతన్యాన్ని వారక్కడ నేర్చుకుంటున్నారిప్పుడు.

వివాహం చేసుకుని అత్తగారింటికొచ్చిన మాలతీ ముర్ముకు అక్కడ బడికి దూరమైన బాల్యానికి ఏదైనా చేయాలన్న తపన నుంచి పుట్టిందే ఆ పురూలియా పూరిగుడిసె పాఠశాల. ముందుగా తన ఇంట్లోనే కొందరు పిల్లలకు తనకు తెలిసిన విద్య చెబుతూ ఓ పాఠశాలను ప్రారంభించిన మాలతీ ముర్ము.. ఆ తర్వాత ఓ పూరిగుడిసెను నిర్మించి ఎలాంటి డిస్టర్బెన్స్ లేనిచోట వారికి విద్యనందిస్తూ పురూలియా గిరిజనానికి ప్రాథమిక విద్య కోసం ఓ ప్రభుత్వ పాఠశాల లేదనే లోటును తీర్చింది.

పశ్చిమ బెంగాల్‌లోని అనేక గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికీ ప్రభుత్వ పాఠశాలలు లేక చాలా ఊళ్లలో బాల్యం బడికి దూరమవుతూనే ఉంది. ఎంతసేపూ రాజకీయాలే తప్ప.. ఎక్కడో కొండకోనల్లో ప్రకృతి మధ్య నివశిస్తున్న వారి చదువుల గురించి పట్టించుకున్న ప్రభుత్వాలు లేకపోవడం.. ఈ నవనాగరిక సమాజంలోనూ ఆ చైతన్యం పాలకుల్లోనో కొరవడటంతో ఇదిగో ఇలాంటి మాలతీ ముర్ములే ఆయా ఊళ్లల్లో చదువుల తల్లి సరస్వతై విద్యావికాసపు వెలుగులు అందిస్తున్నారు. జిలింగ్ సెరెంగ్ ప్రాంతంలో మాలతీ ముర్ము పెట్టిన మట్టి గుడిసె పాఠశాల మార్పుకో సంకేతం. ఏ పాలకులూ గుర్తించని, ఏ అధికారులూ పట్టించుకోని చోట.. ఒక మహిళ ఆలోచన నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దే ఒక వికాస ప్రక్రియ.



మాలతీ ముర్ము చేస్తున్న ప్రయత్నం అక్కడి తోటి గిరిజనానికి కూడా నచ్చింది. తమ పిల్లలు ఇంత అక్షరాలు నేర్చుకుంటూ.. వాటిని వల్లె వేసుకుంటూ.. వల్లె వేసినవాటిని రాసుకుంటూ అక్షరం వైపు అడుగులేస్తున్న ఆ దృశ్యం ఆ గిరిజన పురూలియాను కదిలించింది. అలా మాలతి తన ఇంట్లో పిల్లలకు పాఠాలు చెబుతున్న విషయాన్ని గమనించిన ఆ గిరిజన పెద్దలు.. తమ పిల్లల కోసం ఓ మట్టి గుడిసెను ఏర్పాటుచేసి, రెండు చిన్న తరగతి గదులను నిర్మించి ఇవ్వడంలో సాయమందించారు. ఇప్పుడా గిరిజన బాలబాలికలంతా పురూలియాలో 4వ తరగతి వరకు ప్రాథమిక విద్యనభ్యసిస్తున్నారు.

వాస్తవానికి ఈ పూరిగుడిసె బడికొచ్చే పిల్లలెవ్వరూ అంతకుముందు బడంటే ఎరుగరు. వీరికే బడి తెలియదంటే.. అంతకు ముందున్నవారి పరిస్థితేంటో మళ్లీ ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పుడు పురూలియా తాండాలోని పిల్లలంతా తమ సంతాలీ భాషలో రాయడం, చదవడం చూసి పురూలియా మురిసిపోతోంది. మాలతి భర్త బంకా ముర్ము పాఠశాల నిర్వహణ చూస్తుంటాడు.

మాలతీ, బంకా ముర్ములకు ఇద్దరు పిల్లలు. వారి ఆలనాపాలనా చూసుకుంటూనే.. ఓ పాఠశాలను కూడా నిర్వహిస్తున్నారు ఈ భార్యాభర్తలు. తాము ఎవ్వరినీ ఏమీ అడగమని.. అడిగినా చేసేవాళ్లెవ్వరనే ముర్ము దంపతులు.. కేవలం పిల్లలు వస్తే చాలు.. మేం బడి నడపడానికి ఎప్పటికీ వెనుకాడమంటూ విద్యావికాసం వైపు పురూలియాను నడిపిస్తున్నారు.

పురూలియాలో మాలతీ ముర్ము కథ బాహ్యప్రపంచానికి తెలిశాక.. ఇప్పుడు బెంగాల్‌లోని మమత ప్రభుత్వం సిగ్గుతో తలదించుకునే విమర్శలనెదుర్కొంటోంది. సంకల్పముంటే డబ్బు, ప్రభుత్వాలు, ఇతర సమాజం మద్దతు లేకపోయినా ఎలా సాధించవచ్చో మాలతీ ముర్ము చేసి చూపించింది. తానో గిరిజన గ్రామ మహిళగా.. ఓ హౌస్ వైఫ్‌గా ఉండీ.. పరిమిత వనరుల్లోనూ ఒక మార్పును ఎలా తీసుకురావచ్చో నిరూపించింది.

ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామకాలు, ప్రైవేట్ పాఠశాలల హడావిడీ ఏవీ లేకున్నా.. అవసరం నుంచి పుట్టిన ఓ తరగతి గదికి ఇప్పుడు పురూలియాలోని మట్టిగుడిసె పాఠశాల ఓ ఉదాహరణ.

- బాతాఖానీ సౌజన్యంతో..
















## శ్రీ దక్షిణామూర్తికి అష్టోత్తర పుస్తకార్చన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



స్థానిక గుజరాతిపేటలోనున్న 'శ్రీ ఉమాలక్షేశ్వరాలయం' ప్రదక్షిణ మార్గంలో గల శ్రీ దక్షిణామూర్తి సన్నిధిలో అష్టోత్తర పుస్తకార్చన నిర్వహించారు. కాశిన వెంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు తమ స్వీయ రచనగా 'నమో శ్రీ దక్షిణామూర్తి' అనే 108 పుస్తకాలతో విశ్వ జయము గ్రూప్ సభ్యుల పిల్లల శ్రేయస్సును కోరుతూ స్వామి వారికి అర్చన జరిపించి, వాటిని భక్తులకు వితరణ చేయమని ఆలయ ప్రధానార్చకులు పెంట రామచంద్రశేఖర శర్మకు అందజేశారు. ఈ పుస్తకంలో భారత దేశంలోని పురాణ ప్రసిద్ధ, సుప్రసిద్ధ, లింగరూపంలో గల, విచిత్రాలకు నెలవైన, విభిన్న నామాలతోను, అతి పెద్ద విగ్రహాలు గల దక్షిణామూర్తి ఆలయాల విశేషాలను, స్వామి చరిత్ర, స్తోత్రాలను పొందుపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మీసాల వెంకటరమణ, గురుగుబిల్లి ప్రశాంత్, వనజాక్షి, రెడ్డి ప్రసన్న గాయత్రి పాల్గొన్నారు.

# గ్రీవెన్స్‌కు ఎండార్స్‌మెంట్ల గ్రహణం

మొదటిపేజీ తరువాయి

నిర్వహించి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, పరిష్కారం కోసం వాటిని ఆయా జిల్లా కేంద్రాలకు పంపిస్తున్నారు. గ్రీవెన్స్‌లో సకాలంలో సమస్యకు పరిష్కారం దొరక్కపోవడంతో ఒకే వ్యక్తి అన్నిచోట్ల ఒకే సమస్యపై ఫిర్యాదు చేయడం వల్ల ప్రజా సమస్యల పరిష్కార వేదికపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో జరిపిన భూముల రీ సర్వేలో తలెత్తిన సమస్యలకు పరిష్కారం చూపిస్తామని గ్రామసభలు, ఆ తర్వాత రెవెన్యూ సదస్సులు నిర్వహించినా ఫలితం లేదు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఈ సమస్యలకు పరిష్కారం చూపించలేకపోయారన్న అపవాదు ఉంది. రీసర్వేలో తలెత్తిన సమస్యలపై వేలల్లో అర్జీలు అందాయి. వీటి పరిష్కారం కోసం రైతులు గ్రీవెన్స్‌ను ఆశ్రయిస్తున్నారు. జాయింట్ ఎల్‌పీఎంలు జనరేట్ కావడంతో ఈ-క్రాప్ నమోదు, పంట రుణాలు, భూముల క్రయ విక్రయాలకు అవకాశం లేకుండా పోయింది. గ్రీవెన్స్‌లో జాయింట్ ఎల్‌పీఎంలపై సుమారు 12 వేల అర్జీలు వచ్చాయి. వీటిని పరిష్కరించకుండానే రైతులకు ఎండార్స్‌మెంట్ ఇస్తున్నారు. ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం వెల్లడించిన తర్వాతే పరిష్కారం చూపించగలమని అధికారులు చెబుతున్నారు.

**భూ సమస్యలపై వినతులే అధికం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22 ప్రభుత్వ శాఖలకు సంబంధించి జిల్లాలో నిర్వహిస్తున్న మీకోసం గ్రీవెన్స్‌లో ఇప్పటి వరకు 63,975 అర్జీలు వచ్చాయి. వీటిలో 62,219 అర్జీలను పరిష్కరించినట్టు అధికారులు చెబుతున్నారు. రెవెన్యూ పరిధిలో 31327 అర్జీలకు గాను 30372, సర్వే ల్యాండ్ రికార్డ్స్ పరిధిలో 22,737కు గాను 22,562 అర్జీలు పరిష్కరించినట్టు చూపిస్తున్నారు. కానీ ఈ లెక్కల్లో వాస్తవం లేదనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు గ్రీవెన్స్‌ను పర్యవేక్షిస్తుండడంతో జిల్లా అధికారులు అర్జీదారులకు ఎండార్స్‌మెంట్లు ఇచ్చి సమస్యలు పరిష్కారించినట్లు చూపించి చేతులు దులుపుకొంటున్నారు. ఎండార్స్‌మెంట్ ఇచ్చిన తర్వాత సమస్య పరిష్కారం కాలేదని మళ్లీ అందే అర్జీలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసిన వెంటనే పాతవి కూడా రీ ఓపెన్ అవుతాయి. అందువల్ల ఇటువంటి వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని అర్జీదారులు ఆరోపిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం చేస్తున్న పొరపాట్ల వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆరోపణలున్నాయి. దీనివల్ల వచ్చే అర్జీలకు పరిష్కారం లభించడం లేదని విమర్శలున్నాయి. వీటిని క్షేత్ర స్థాయిలో పరిష్కంచాల్సిన రెవెన్యూ ఉద్యోగులు తప్పులు చేయడం వల్ల ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురికావల్సి ఉంటుంది. దీంతో ఎల్పీఎం, జీరో ఎక్స్‌టెంట్, ప్రభుత్వ భూమి ఆక్రమణ, అడంగల్ లాంటి సమస్యలకు పరిష్కారం చూపించకుండా ఎండార్స్‌మెంట్లు ఇచ్చేస్తున్నారు. న్యాయపరమైన చిక్కులు, వివాదస్పద భూములు, చెరువులు, ప్రభుత్వ భూమి ఆక్రమణ, రీ-సర్వేలో రెవెన్యూ సిబ్బంది చేసిన తప్పిదాలపైనే గ్రీవెన్స్‌కు అధిక శాతం ఫిర్యాదులు అందుతున్నట్లు సమాచారం. 20 ఏళ్లు పైగా లబ్ధిదారుల అనుభవంలో ఉన్న డీ పట్టా భూములు, పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలను వారి వారసుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వీలుగా ఫ్రీ హోల్డ్ జీవోను వైకాపా ప్రభుత్వం 2023లో జారీ చేసింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ జీవోను పెండింగులో పడేసింది. వీటికి సంబంధించిన అంశాలపైనా వినతులు వస్తున్నాయి. అయితే అధికారులు మాత్రం ఇప్పటి వరకు 97 శాతం అర్జీలకు పరిష్కారం చూపించినట్టు ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తున్నారు.


### హరిపురంలో 18న

## ముంజూరు పుస్తకావిష్కరణ

సత్యంన్యూస్, శ్రీకాకుళం

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు పేర్లతో ఆరు జిల్లాల ప్రాంతంగా విలసిల్లుతున్న కళింగాంధ్ర ప్రాంతంలో కవులందరినీ ఒకచోటకు చేర్చి ఒక డైరక్టరీని తీసుకువద్దామని మొదలుపెట్టిన ప్రయత్నం ఒక గ్రంథంగా రూపుదిద్దుకుంది. ఈ కళింగాంధ్ర కవితావార్షికకు మన భాష గుబాళింపు అద్దేందుకు 'ముంజూరు'గా నామకరణం చేశారు. ఇందులో 72 మంది కవులు రాసిన 130 కవితలున్నాయి. అనుబంధంగా ఉన్న డైరక్టరీలో 260 మందికి పైగా కళింగాంధ్ర కవుల వివరాలను పొందుపరిచారు. ఈ ప్రచురణ ఈ ప్రాంత అస్తిత్వ ఉద్యమానికి కీలకం కాగలదని ప్రచురణ కర్తలు పేర్కొన్నారు.

మందస మండలం హరిపురం గ్రామంలో ఈ నెల 18న శుక్రవారం 'ముంజూరు' కవితా సంకలనం ఆవిష్కరించనున్నారు. ఉద్దానం ప్రాంతంలో కృషి చేస్తున్న సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పుస్తక ఆవిష్కరణలో ప్రముఖ చరిత్రకారులు నల్లి ధర్మారావు ముఖ్య వక్తగా హాజరు కానున్నారు. కింతలి కృష్ణమూర్తి, డాక్టర్ కణితి కేశవరావు, డాక్టర్ కుమార్ నాయక్, మజ్జి భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, వినోద్ కుత్తుం, రాపాక ధనరాజు తదితరులు పాల్గొంటారని సిక్కోలు బుక్స్ వ్యవస్థాపకులు దుప్పల రవికుమార్ తెలిపారు.




## న్యాయం చేసే వరకు పోరాడుతాం

- ప్రభుత్వం ప్రత్యామ్నాయ అవకాశాలను కల్పించాలి
- ఎండీయూ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర ప్రతినిధులు

(సత్యంన్యూస్, విజయవాడ)



ప్రభుత్వం కక్షపూరితంగా రాష్ట్రంలో 9,260 మంది ఎండీయూ ఆపరేటర్లను తొలగించిందని ఎండీయూ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిషోర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ, అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఎండీయూ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులతో కలిసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎండియూ ఆపరేటర్లను ఉద్దేశించి రేషన్ మాఫియా జరిగిందని చెప్పడం దారుణమన్నారు. ఇటువంటి వ్యాఖ్యల వల్ల తమ మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో 40ఏళ్ల సుదీర్ఘ అనుభవం కలిగిన చంద్రబాబునాయుడు కూడా తమ గురించి తప్పుగా మాట్లాడుతుండడం తమకు తీవ్ర మనోవేదనకు గురి చేస్తుందని పేర్కొన్నారు. 18,500 కుటుంబాలను రోడ్డున పడేసి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను మూట కట్టుకున్నారని తెలిపారు. ఎండీయూ ఆపరేటర్ల తొలగింపుతో ప్రభుత్వానికి రూ.300 కోట్లు ఆదాయం మిగిలిందని చెప్పడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. యోగాంధ్ర పేరుతో ఒక్కరోజులోనే రూ.350 కోట్లను ప్రభుత్వం స్వాహా చేసిందని పేర్కొన్నారు. తాము వైకాపా కార్యకర్తమని, జగన్ అనుచరులమని పేర్కొంటూ వాహనాలను కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని, వాటిని తిరిగి ఇచ్చేమని చెప్పడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. అప్పులు చేసి తామంతా జీవితాలు నెట్టుకొస్తున్నామని, ప్రభుత్వం స్పందించాలని కోరారు. అలాగే ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన రెండు సంవత్సరాల బకాయిలు ఇవ్వాలని కోరారు. ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి వరద బాధితుల సహాయార్థం 56 లక్షల రూపాయలు ఇచ్చిన విషయాన్ని వారు గుర్తుచేశారు. తమకు అన్యాయం జరిగిందని తెలియజేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, కేసు వేసిన వారిలో 16 జిల్లాల ప్రతినిధులు ఉన్నారని తెలియజేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎండియూ ఆపరేటర్స్ ప్రతినిధులు చుండూరు సాంబశివరావు, సతీష్, సుధాకర్ రెడ్డి, వెంకట్ దేవ సహాయం, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

# కళింగ ప్రాభవ ప్రతీక.. బాలియాత్ర

(మొదటిపేజీ తరువాయి)

చక్రవర్తి అయిన తర్వాత మళ్లీ కళింగ దేశంపై దండెత్తాడు. దాంతో క్రీ.పూ. 261లో మగధ, కళింగ సేనల మధ్య జరిగిన భీకర యుద్ధమే కళింగ యుద్ధంగా చరిత్రకెక్కింది. ఆ మహాయుద్ధంలో మొదట అశోకుడు గెలవలేదు. కళింగ సేనల ధాటికి తట్టుకోలేక వెనుదిరిగి అదను కోసం వేచి చూశాడు. యుద్ధం ముగిసిందన్న భావనతో కళింగ వీరులంతా వెనుదిరిగి కార్తీక పౌర్ణమి రోజున తమ పూర్వీకుల ఆచారమైన బాలియాత్రకు వెళ్లారు. ఇదే అదనుగా అశోకుడి సేనలు కళింగపై మళ్లీ దండెత్తాయి. ఈ యుద్ధంలో సుమారు లక్ష మంది కళింగ సైనికులు, ప్రజలు మరణించగా, దాదాపు అంతే సంఖ్యలో మగధ సేనలకు నష్టం వాటిల్లింది. ఆ విధంగా కళింగ యుద్ధంతో బాలియాత్రకు చారిత్రక సంబంధం ఉందంటారు.

**మరో కథనం ప్రకారం..**

పురాతన భారత ఉపఖండంలో కళింగ సామ్రాజ్యంలో ప్రజలు వ్యవసాయం, నౌకా నిర్మాణంతోపాటు, నౌకాయానం, సముద్ర మార్గంలో ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యాపారం చేయడంలో సిద్ధహస్తులుగా పేరొందారు. సముద్ర యానం గురించి ప్రపంచానికి పెద్దగా తెలియని రోజుల్లోనే సొంతంగా నౌకలు నిర్మించి, వాటిలోనే అనేక ప్రాంతాలకు వెళ్లి వ్యాపారం చేసేవారు. అప్పటి కళింగ సామ్రాజ్య రాజధాని అయిన శ్రీముఖలింగ క్షేత్రం వద్ద వంశధార నదిలో తమ నావలపై బియ్యం, సుగంధ ద్రవ్యాలు, ఏనుగు దంతాలు, ఇతర వస్తుసామగ్రిని ఎక్కించుకుని సముద్ర మార్గంలో ఇండోనేషియాలోని బాలి ద్వీపానికి మొదట చేరుకున్నారు. తర్వాత అక్కడి నుంచి ఆగ్నేయాసియా దేశాలైన సుమిత్ర, మలయా (మలేషియా), జావా, సింగపూర్, సిలోన్(శ్రీలంక) తదితర దేశాల్లో వర్తకం చేసి తిరిగి శివరాత్రి నాటికి స్వస్థలానికి చేరుకునేవారు. అలా వారు వ్యాపారం కోసం మొదట వెళ్లిన ద్వీపం పేరు కూడా కళింగ రాజు 'బలి' పేరుతోనే బాలిగా స్థిరపడిందని చరిత్ర ద్వారా తెలుస్తోంది. బాలి ద్వీపంలో కళింగ పేరుకు దగ్గరగా ఉండే కెలింగ్ అనే ఆదిమ జాతి జీవనం సాగిస్తోంది. కాగా సముద్ర యానం ఒక సాహస యాత్ర. ఎప్పుడు ఎలాంటి విపత్తు ఎదురవుతుందో తెలియదు. సముద్ర జీవుల దాడులు, తుపానుల వల్ల ప్రయాణంలోనే ఎంతోమంది కళింగ నావికులు మృత్యువాత పడేవారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సముద్రతీర దేశాల్లో వ్యాపారానికి వెళ్లే తమ కుటుంబ సభ్యులు క్షేమంగా తిరిగి రావాలని దేవుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబాల్లోని మహిళలు ఏటా కార్తీక పౌర్ణమి రోజున వంశధార తీరం పొడవునా దీపాలతో దీపోత్సవం, తెప్పోత్సవాలు నిర్వహించేవారు. సుమారు ఐదువేల ఏళ్లకు క్రితం నుంచే ఈ సంప్రదాయం ఉందంటారు. ఇలా చేయడం వల్ల ఇప్పుడు మృతి చెందినవారితో పాటు పూర్వీకుల ఆత్మలు శాంతించి, వారి ఆశీర్వాదం లభిస్తుందన్నది కళింగుల నమ్మకం.

**1992లో కటక్‌లో పునఃప్రారంభం**


కళింగ రాజ్య విస్తరణ జరిగిన క్రమంలో రాజధానిని శ్రీముఖలింగం నుంచి ధాన్య కటకానికి(కటక్) మార్చిన తర్వాత కొన్నేళ్లు పర్లాకిమిడి గజపతి రాజులు పాలించారు. అయినా నిరాఘాటంగా కొనసాగిన బాలియాత్ర బ్రిటీష్ కాలంలో చోటుచేసుకున్న పరిణామాల కారణంగా నిలిచిపోయింది. కాగా ఒక ముని శాపం వల్ల కళింగులు తమ వైభవం కోల్పోయి, తమలో తామే కొట్టుకుని బలహీనపడి ప్రాభవం కోల్పోయారని చైనా యాత్రికుడు హుయన్ త్సాంగ్ రాసిన పుస్తకం ద్వారా తెలుస్తోంది. అయితే సుదీర్ఘకాలంగా తెరమరుగైన ఈ సంప్రదాయాన్ని నాటి కళింగ సామ్రాజ్య రాజధాని, ఇప్పటి ఒడిశా పాత రాజధాని అయిన కటక్ ప్రజలు మళ్లీ వెలుగులోకి తెచ్చారు. సుమారు మూడు దశాబ్దాల క్రితం 1992లో ఆనాటి ఒడిశా ముఖ్యమంత్రి దివంగత బిజూ పట్నాయక్ ఆధునిక బాలియాత్రను ప్రారంభించారు. కరోనా కారణంగా 2020, 2021 సంవత్సరాల్లో బ్రేక్ పడినా, ఆ తర్వాత మళ్లీ యధావిధిగా చేస్తున్నారు. ఆ ఉత్సవంలో భాగంగా మహానదితోపాటు అందుబాటులో ఉన్న చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరుల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో పూర్వీకులకు తర్పణాలు విడిచి అరటి డొప్పలు, చిన్న చిన్న కాగితపు పడవల్లో కార్తీక పౌర్ణమి రాత్రి దీపాలు వదలుతున్నారు. కార్తీక పౌర్ణమి నుంచి ప్రథమ అష్టమి వరకు తొమ్మిది రోజులపాటు జరిగే ఈ యాత్రలో భాగంగా భారీ వాణిజ్య ప్రదర్శన (ట్రెడ్‌ఫెయిర్) నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అసియాలో అతిపెద్ద ప్రదర్శనగా దీనికి పేరుంది. ఒడిశా రాష్ట్ర ప్రభుత్వమే బాలియాత్రను అధికారికంగా నిర్వహిస్తోంది.

**గత ఏడాది నుంచి శ్రీముఖలింగంలో..**

ఒకప్పటి కళింగ సామ్రాజ్యానికి తొలి రాజధానిగా విలసిల్లిన మన శ్రీకాకుళం జిల్లాలోని శ్రీముఖలింగంలోనూ గత ఏడాది నుంచి బాలి యాత్ర జరపడం ప్రారంభించారు. కటక్ స్ఫూర్తితో మొదలైన ఈ యాత్రను ఇక్కడ మూడు రోజులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది కార్తీక పౌర్ణమి తిథి అయిన నవంబర్ తొమ్మిదో తేదీన బాలియాత్రను ఘనంగా జరపాలని నిర్వాహక కమిటీ ఇటీవల జరిపిన సమావేశంలో నిర్ణయించింది. ఇది ప్రధానంగా మహిళల పండుగ. ఆ రోజే సన్నిగొడ్డను మహిళలు వీధిలో పెట్టి కార్తీక నోము నోస్తారు. సన్ని అనేది భార్య, గొడ్డ అనేది భర్తగా భావిస్తారు. వ్యాపారానికి సముద్రంపైకి వెళ్లిన తమ భర్తలు క్షేమంగా తిరిగి రావాలని, తాము సుమంగళిగా ఉండాలని కోరుకుంటూ ఈ నోము చేస్తారు. బాలి యాత్రలోనూ పాల్గొంటారు. ఈ ఏడాది కూడా దీన్ని సంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహించి సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుందామని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## నగరాలకు ధీటుగా గ్రామాల అభివృద్ధి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)



ఎన్నడూలేని శ్రీకాకుళం అభివృద్ధిని రానున్న రోజులలో చూస్తారని, నగరాలకు దీటుగా గ్రామాలను కూడా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ గురువారం అన్నారు. సుపరిపాలన తొలిఅడుగులో భాగంగా గార మండలం, వత్సవలస పంచాయతీ, శ్రీరామవానిపేట, కుట్టువానిపేట, పేర్లవానిపేట, మొగదలపాడు గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తూ, గ్రామాలలో చేయవలసిన పనులను పరిశీలించారు. అనంతరం గ్రామాలలో ఉండే సమస్యలను, ప్రజా సమస్యలను అడిగి, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయో, లేదో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని, ఎటువంటి సమస్యనైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా నాకు తెలియజేస్తే, సమస్య పరిష్కారమయ్యేవిధంగా చూస్తానన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే, మన ఆరోగ్యాలు బాగుంటాయన్నారు. ఇంట్లో వ్యర్థాలను బయటగాని, కాలువలలోగాని వెయ్యకుండా, గ్రామ పరిధిలో, పంచాయతీ సిబ్బంది అమర్చిన చెత్తబుట్టలో వెయ్యాలని, అప్పుడే సుందరగ్రామంగా చూడవచ్చున్నారు. కేంద్రంలో బీజేపీ సహకారంతో, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి ఆలోచనలతో కూటమిప్రభుత్వం అభివృద్ధిపదంలో నడుస్తుందని, ప్రజలు నమ్మకంతో తమను గెలిపించారని, ప్రజాసేవతో ఆ ఋణం తీర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, టీడీపీ గార మండల అధ్యక్ష బృందం, మండల టీడీపీ నాయకులు, పంచాయతీ అధికారులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.




సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 15వ డివిజన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్, తూర్పుకాపు సాధికార సమితి డైరెక్టర్ పాండ్రంకి శంకర్ ఇంటింటికీ వెళ్లి కూటమి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పూణ్ణ సర్వేశ్వరరావు, పాండ్రంకి దేవేంద్రనాయుడు, ఎస్ఎస్ జ్యువలరీ సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## కలెక్టరేట్ భవనాన్ని రెండు నెలల్లో పూర్తి చేస్తాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రానికి తలమానికంగా నిలిచే శ్రీకాకుళం జిల్లా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్ భవన్ నిర్మాణం రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లా ప్రజలకు అంకితం చేస్తామని రహదారులు, భవనాల శాఖ పర్యవేక్షణ ఇంజినీర్ పి.సత్యనారాయణ చెప్పారు. గురువారం శ్రీకాకుళం ఆర్ అండ్ బి సర్కిల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం ప్రారంభించి రూ.116.50కోట్లతో నిర్మిస్తున్న కలెక్టరేట్ కాంప్లెక్స్ భవన్‌లో జిల్లాకు చెందిన అన్ని ప్రభుత్వ శాఖలు ఒకేచోట ఉంటాయన్నారు. ప్రజలకు ఒకేచోట అధికారులు అంతా అందుబాటులో ఉంటారని రాష్ట్రంలో ఒక్క శ్రీకాకుళం జిల్లాలో మాత్రమే ఈ తాజా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన భవన్ నిర్మాణం జరుగుతుందన్నారు. గతుకుల రోడ్ల పునరుద్ధరణ పథకంలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాకు రూ.12 కోట్లు మంజూరు చేసిందని, ఈ నిధులతో 220 కిలోమీటర్ల రహదారి పరిధిలో గుంతలు కప్పి సాధారణ రోడ్ల తరహాలో తీసుకువచ్చామన్నారు. జిల్లాలో నాగావళి నదిపై బసవలరేవు వద్ద రూ.115కోట్లతో వంతెన నిర్మాణం చేపడుతున్నామన్నారు. అదేవిధంగా వంశధార నదిపై వనిత మండలం వద్ద మరో వంతెన కలిపి రెండు ప్రధాన వంతెనలు రూ.159 కోట్లతో నిర్మిస్తున్నామని, ఏడాదిలో వీటిని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. 40ఏళ్లు దాటిన వంతెనలు ఎన్ని ఉన్నాయో సర్వే చేస్తున్నామన్నారు. నాబార్డ్, సుడా, ఎన్‌డిపి పేజ్-1, సిఆర్ఎఫ్, ఎస్‌డిఎంఎఫ్ వంటి వివిధ పథకాల కింద మంజూరైన సుమారు రూ.45 కోట్లతో రహదారులు, భవనాలు నిర్మిస్తున్నామని ఎస్ఈ సత్యనారాయణ స్పష్టం చేశారు. జిల్లా ప్రజలకు ప్రధాన రహదారిగా నిలిచే శ్రీకాకుళం నుండి ఆమదాలవలస వెళ్ళే రహదారి పనులు మరో రెండు నెలల్లో పూర్తి అవుతాయన్నారు. రెండు కల్వర్ట్స్ నిర్మాణం మాత్రమే ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న ప్రధాన రహదారులు అన్నీ విడతల వారీగా అభివృద్ధి చేస్తామని అన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.